వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శుక్రవారం 27 జూన్ 2025


## ప్రజల మధ్యే మంత్రి.. సమస్యలకు తక్షణ పరిష్కారం

చిన్నమండెం, జూన్ 26 ప్రభాతవార్త ;

మండలంలోని బోర్రెడ్డిగారిపల్లెలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్వగ్రామం బొడిరెడ్డిగారిపల్లిలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి వందలాది మంది ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను మంత్రికి వినిపించారు. ప్రతి ఒక్కరి సమస్యను శ్రద్ధగా విన్న మంత్రి తగిన సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల ఆశయాలను సమర్థవంతంగా నెరవేర్చే దిశగా తన శ్రమను అంకితపెడతానని మంత్రి తెలిపారు.



## స్మశాణ స్థలంను పరిశీలించిన ఆర్డీఓ

రాజుపాళెం, జూన్ 26, ప్రభాతవార్త:

మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలో గురువారం ఎస్సీ కాలనీ వాసుల స్మశాన స్థలంను జమ్మలమడుగు ఆర్డీఓ సాయి శ్రీ, ఎమ్మార్వో వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. ఈ స్థలం యొక్క వివరాలను సంబంధిత అధికారులను అడగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఉశేన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# కడప జిల్లాకు అమృత్-2 పథకం ద్వారా రూ.965కోట్లు నిధులు

## కడప కార్పొరేషన్‌కు రూ.663.05కోట్లు

**బద్వేల్ మున్సిపాల్టీకి రూ.100కోట్లు**

**మైదుకూరుకు రూ.99కోట్లు**

**జమ్మలమడుగుకు రూ.12.47కోట్లు**

**అన్నమయ్య ప్రాజెక్టు పోయింది-రాజంపేటకు అమృత్ పథకం పోయిందా?**

**టెండర్లలో రాజంపేట మున్సిపాలిటీ కనిపించని పరిస్థితి**

రాజంపేట, జూన్ 26, ప్రభాతవార్త:

కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్-2తో జిల్లాకు నిధుల వర్షం కురిసింది. జగన్ హయాంలో అటకెక్కిన అమృత్ పథకం కూటమి ప్రభుత్వం రాకతో మరళా ప్రాణం వచ్చింది. తాజాగా గురువారం అమృత్ పథకంతో కడప జిల్లాలో రూ.965.45కోట్ల అంచనా వ్యయంతో పట్టణ ప్రాంతాల్లో పైప్‌లైన్ వ్యవస్థను సమూలంగా మార్చేందుకు మురికి నీటి వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు అనంతపురం ప్రాంతీయ పబ్లిక్ హెల్త్ సూపర్నెంట్ ఇంజనీర్ రామ్మోహన్ రెడ్డి టెండర్ ఉత్వర్వులు జారీ చేశారు. కడప కార్పొరేషన్‌కు భారీగా నిధులు మంజూరు అయ్యాయి. ఏకంగా రూ.663.05కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. మంచినీటి పథకాలకు పైప్‌లైన్ వ్యవస్థ అభివృద్ధికి రూ.592.23కోట్లు మురికి నీటి వ్యవస్థ అభివృద్ధికి రూ.70.82కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. అలాగే బద్వేల్ మున్సిపాల్టీలో మంచినీటి పథకాల పైప్‌లైన్ వ్యవస్థ అభివృద్ధికి రూ.77.14కోట్లు, మురికి నీటి వ్యవస్థ అభివృద్ధికి రూ.23.10కోట్లు మంజూరు అయ్యాయి. మైదుకూరు మున్సిపాల్టీకి రూ.99.70కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. జమ్మలమడుగు మున్సిపాల్టీకి రూ.12.47కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. మొత్తం జిల్లా అంతా కలిపి ఒకే ప్యాకేజీగా టెండర్లు పిలిచారు. కాన్సేషనీర్ హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ద్వారా పనులు చేపట్టనున్నారు. టెండర్లలో పాల్గొనేందుకు జూలై 21 చివరి గడువుగా నిర్ణయించారు.

**రాజంపేటకు అమృత్ పథకం గోయిందా!**

అన్నమయ్య ప్రాజెక్టు ఎర్త్ డ్యాం కొట్టుకుపోవడంతో అమృత్ పథకాన్ని కూడ అధికారులు నిలిపివేశారు. అన్నమయ్య ప్రాజెక్టు నుంచి రాజంపేట పట్టణానికి నీరందించే స్కీం కొనసాగుతున్న అమృత్ పథకం ద్వారా నిధులు ఎందుకు నిలిపివేశారో అర్థం కావడం లేదు. ఎందుకంటే రెండేళ్ల క్రితం 30.12కోట్లతో అమృత్ పథకం ద్వారా రాజంపేటలో మంచి నీటి పైప్‌లైన్ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు 30.12కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. అయితే ఒక్కరే గుత్తేదారు టెండర్లలో పాల్గొనడంతో నాడు వైకాపా సర్కార్ ఆ టెండర్లను రద్దు చేసింది. మరళా డీపీఆర్ పిలిచి పనులు చేపడుతామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. అయితే డీపీఆర్ రాలేదు సరికదా జిల్లాలోని అన్ని మున్సిపాల్టీలో అమృత్ పథకం ద్వారా పనులు చేపట్టేందుకు గురువారం టెండర్ ఉత్వర్వులు జారీ అయ్యాయి. అందులో రాజంపేట మున్సిపాలిటీకి అమృత్ పథకం ద్వారా నిధులు కేటాయించి టెండర్లు పిలవలేదు. అందుకు కారణం అన్నమయ్య ప్రాజెక్టు లేదని అందుకే అమృత్ పథకం రాజంపేట మున్సిపాల్టీకి నిలిచిపోయిందని ఓ ఇంజనీరింగ్ అధికారి వ్యాఖ్యానించారు. అసలు అమృత్ పథకానికి అన్నమయ్య ప్రాజెక్టుకు ఏమి సంబంధమో అర్థం కావడం లేదు. ఇకనైనా మున్సిపల్ పాలకవర్గం, అధికార కూటమి నేతలు రాజంపేట మున్సిపాల్టీకి అమృత్ పథకం నిధులతో ఎందుకు టెండర్లు పిలవలేదని పబ్లిక్ హెల్త్ అధికారుల దృష్టికి తీసుకుపోయి పనులు చేపట్టేలా చొరవ చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



.కడప నగరంలో పైప్‌లైన్ వ్యవస్థకు మహర్దశ

## డ్రగ్స్ రహిత సమాజం కోసం

# ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**సబ్‌కలెక్టర్, డిఎస్‌పిలు పిలుపు**

కురబలకోట, జూన్ 26 ప్రభాతవార్త :

డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, డిఎస్‌పి మహేంద్రలు పిలుపునిచ్చారు. కురబలకోట మండలం అంగళ్ళు వద్ద ఉన్న విశ్వం ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో మాధకద్రవ్యాలు, వాటి పర్యావస్తానాలు-యువతకు అవగాహన పెంచాలని కోరుతూ విశ్వం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిరోదక దినోత్సవాన్ని పురస్కరించుకొని మదనపల్లె పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మిషన్‌కాంపౌండ్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను, కళాశాలలో అవగాహన కల్పించాలన్నారు. మాదకద్రవ్యాల వాడకం వల్ల యువత శారీరకంగా, ఆర్థికంగా నష్టపోతారని వాటికి దూరంగా ఉండాలని కోరారు. డిఎస్‌పి మహేంద్ర మాట్లాడుతూ మాదకద్రవ్యాలు చాలా ప్రమాదకరమని వాటిని ఎవరైనా వినియోగిస్తుంటే వెంటనే సమాచారం అందించారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎవరైనా వాటిని వినియోగిస్తే అలాంటి వారికికౌన్సిలింగ్ చేసి బానిసలు కాకుండా కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి, విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు,

## జడ్పీ క్రీడా మైదానం అభివృద్ధికి ఎంపీ హామీ

రాజంపేట,జూన్26 ప్రభాతవార్త

నందలూరు మండలం, నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ గ్రౌండ్లో వసతుల కొరతపై మండల పరిషత్ అధ్యక్షులు మేడా విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ రెడ్డిని పలువురు యువకులు, విద్యార్థులు కలిశారు. యం.పి దృష్టికి ఆరవపల్లె గ్రౌండ్ యూత్, ఎన్నో రోజులుగా జిల్లా పరిషత్ గ్రౌండ్ పరిసర ప్రాంతంలో బాలికల చేంజింగ్ రూమ్ విషయం, బలహీనపడిన ప్రహరీ గోడ విషయంగా చాలాసార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు వివరించినా ఎలాంటి ప్రయోజనం జరగలేదన్నారు. ఈ మేరకు రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని యువతకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 5వార్డు సభ్యులు అరుణ్ యాదవ్, హరి ప్రసాద్, హర్ష వర్ధన్, శాంత కుమార్, మహమ్మద్ ఫరూక్, కనకయ్య, జతిన్, జస్వంత్, ప్రవీణ్, వహబ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.



## డ్రగ్స్ మహమ్మారి అణుబాంబు కంటే ప్రమాదకరమైనది



రాయచోటి, జూన్ 26 ప్రభాతవార్త

డ్రగ్స్ మహమ్మారి అణుబాంబు కంటే ప్రమాదకరమైనదని, మాదకద్రవ్యాలకు సంబంధించి టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు ఫోన్ చేసి సమాచారం తెలపాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు తదితరులు గురువారం ఉదయం 9:30 గంటలకు రాయచోటి పట్టణంలో శివాలయం సర్కిల్ నుండి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీని శివాలయం సర్కిల్ నుండి నేతాజీ సర్కిల్ వరకూ (బంగ్లా) వరకు నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. డ్రగ్స్ మహమ్మారి అణుబాంబు కంటే శక్తివంతమైనదని ఇది భారతదేశం మే కాదు యావత్ ప్రపంచాన్ని పనికిస్తోందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మాదకద్రవ్యాలను ఉపయోగించడం వలన సమాజానికి, మనకు మన భవిష్యత్తు తరాల వారికి, విద్యార్థులకు ఎంత ప్రమాదకరము తెలియజేసేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో విద్యార్థిని,విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల వినియోగం, అమ్మకం రవాణా చేయడం ద్వారా కేసులు పడి తద్వారా ఉద్యోగాలకు అర్హత సాధించక వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితిని గమనించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థిని,విద్యార్థులు, యువతకు నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవం ద్వారా వీరికి అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణ పై అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్డీఓ, అటవీ, వైద్య, విద్య, డ్రగ్స్ కంట్రోల్, రాయచోటి ఎమ్మార్వో, వివిధ శాఖల అధికారులు, ఐటిఐ, పాఠశాలల ప్రతినిధులు విద్యార్థిని విద్యార్థులు,మహిళా సంఘాలు,తదితరులు పాల్గొన్నారు.

## ఘర్షణ వద్దన్నందుకు కత్తితో దాడి

మదనపల్లి క్రైమ్ జూన్ 26 ప్రభాతవార్త.

తోడికోడళ్ళు ఘర్షణ పడుతుండగా వద్దన్నందుకు కత్తితో దాడి చేసిన సంఘటన గురువారం మదనపల్లిలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సత్యసాయి జిల్లా కదిరి పట్టణం రాజీవ్ నగర్ కు చెందిన అమృత ను, మదనపల్లె పట్టణం కుమారపురం లో ఉన్న మున్సిపల్ ఉద్యోగి శ్రీనివాసులకి ఇచ్చి 15 సంవత్సరాల క్రితం వివాహం చేశారు. శ్రీనివాసులు తన ఇద్దరు అన్నదమ్ములైన శంకర, గోవిందు తో కలిసి ఒకే కాంపౌండ్ లో వేర్వేరుగా నివాసం ఉంటున్నారు. గురువారం ఉదయం శ్రీనివాసులు ఇంటి వద్ద లేని సమయంలో అమృతకు తోడికోడళ్లయిన మంగమ్మ అనసూయమ్మతో వివాదం ఏర్పడి, ఘర్షణ చోటు చేసుకోగా, వారందరు కుటుంబ సభ్యులతో కలిసి అమృత పై దాడి చేసి కొట్టారు. ఈ విషయం ఆమె పుట్టింటి వారికి చెప్పడంతో, వారు పది మందితో కలిసి కుమారపురం కు చేరుకుని ఘర్షణ గల కారణాలను ఆరా తీస్తుండగా, అనసూయమ్మ కుమార్తె భారతి ఇంట్లో ఉన్న సత్తూర్ ( కత్తి)తో అమృత ఆడపడుచు అయిన సురేఖ (30)పై దాడి చేసింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయం అయింది. అలాగే శంకర, గోవిందు, భువనేశ్వరి, మంగమ్మ, అనసూయమ్మ లు, కదిరి నుంచి వచ్చిన అమృత బంధువులపై దాడి చేశారు. దాడిలో కళ్యాణ్ కుమార్ (30), రాజ్యలక్ష్మి(27) గాయపడ్డారు. స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై వన్ టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

## అర్హులైన వికలాంగులకు ఇంటి పట్టాలు మంజూరు చేస్తాం

మదనపల్లి క్రైమ్ జూన్ 26 ప్రభాతవార్త.

అర్హులైన వికలాంగులందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయిస్తారని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాష హామీ ఇచ్చారు. గురువారం ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యేకు వినతి పత్రాలు సమర్పించారు.. మదనపల్లి నియోజకవర్గ నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన దివ్యాంగులు తమకు నివాసం కోసం ఇంటి స్థలాలను మంజూరు చేయాల్సిందిగా ఎమ్మెల్యేని అభ్యర్థించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మదనపల్లి నియోజకవర్గంలో ప్రతి దివ్యాంగుడికి ఇల్లు మంజూరు చేసే బాధ్యత తమ ప్రభుత్వందని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో దివ్యాంగుల ఆధ్వర్యంలో పారా స్పోర్ట్స్ చైతన్య యాత్ర లో భాగంగా మదనపల్లికి విచ్చేసిన చైతన్య రథాన్ని దివ్యాంగులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో దివ్యాంగులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పార స్పోర్ట్స్ సెక్రటరీ రామస్వామి, గుంటూరు జిల్లా సెక్రెటరీ పారా స్పోర్ట్స్ సెక్రటరీ డాక్టర్ వై శ్రీనివాస్ గౌడ్, నెల్లూరు జిల్లా పారా కమిటీ అధ్యక్షులు మాల్యాద్రి నాయుడు, ట్రైని సంస్థ కన్వీనర్ సురేష్, దివ్యాంగుల నియోజకవర్గం అధ్యక్షులు వెంకటరమణ, మదనపల్లి పట్టణ అధ్యక్షుడు రెడ్డి బాబు, రూరల్ మండలం అధ్యక్షులు నరసింహులు, నిమ్మనపల్లి మండల అధ్యక్షుడు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.




## పాఠశాల విద్యార్థులకు విద్యాసామాగ్రి వితరణ

బద్వేల్ అర్బన్ జూన్ 26 ప్రభాతవార్త :

బద్వేల్ మండలం లక్ష్మీ పాలెం ఎంపీ యుపి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గురువారం ఉదయం పలువురు విద్యార్థులకు విద్యాసామాగ్రిని అందజేశారు, అనంతరం డాక్టర్ దిలీప్ గుప్తా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్న వయసు నుంచే కష్టపడి బాగా చదువుకొని మంచి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు అప్పుడే చదువు నేర్పిన గురువులకు తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకు వచ్చిన వారవుతారన్నారు, ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పీవీ చంద్రశేఖర్, రామకృష్ణ రాజు, ప్రసాదు, వెంకటరెడ్డి, వీరమ్మ సుబ్బారావు, కాసింపేరా తోపాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులకు భూమిపూజ

దువ్వూరు, జూన్ 26, ప్రభాతవార్త:

ఇటివల రాష్ట్ర ప్రభుత్వం వివిధ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడంతో ఆయా పనులకు సంబంధించి భూమిపూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. ముందుగా కేసీ కెనాల్ నీటి సంఘానికి ఇటివల ప్రభుత్వం 17లక్షల నిధులు కేటాయించడంతో గురువారం అలుగు వంక పైన 8లక్షలలో నిర్మిస్తున్న చెక్ డ్యాంకు నీటి సంఘం అధ్యక్షుడు కోనేటి హరినాథ్, మండల టీడీపీ అధ్యక్షుడు బోరెడ్డి వెంకట రమణారెడ్డిలు భూమిపూజ నిర్వహించారు. అలాగే దువ్వూరు-నేలటూరు రహదారిలో నేలటూరు మెట్ట వద్ద బస్ షెల్టర్ నిర్మాణానికి 5లక్షల రూపాయలు, అలాగే మరుగుదొడ్ల నిర్మాణానికి 3లక్షల రూపాయల నిధులు కేటాయించారు. ఈ పనులను సర్పంచ్ శారద ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో కేసీ కెనాల్ ఏఈ పవన్‌కుమార్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ సుబ్రమణ్యం, వెంకటేశ్వర్ రెడ్డి, రవీంద్రా రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## తెలుగుదేశం కోవర్టుకు తెలుగు తమ్ముళ్ల దేహశుద్ధి

బద్వేలు, జూన్ 26, ప్రభాతవార్త

కలసపాడు మండలంలో తెలుగుదేశం కోవర్టుగా ఉన్న ప్రహ్లాద రెడ్డిని తంబళ్లపల్లె పంచాయతీకి చెందిన తెలుగు తమ్ముళ్లు దేహశుద్ధి చేశారు. గత ఎన్నికలలో టిడిపి నాయకుడైన ప్రహ్లాద రెడ్డిని వైసిపి నాయకులకు సమాచారం ఇస్తూ తెలుగుదేశం పార్టీకి వెన్నుపోటు పొడిచారని నెపంతో గురువారం కలసపాడు మండలంలో బూత్ కమిటీ సమావేశం జరుగుతుండగా ప్రహ్లాద రెడ్డి రాగా అదే పంచాయతీకి చెందిన తెలుగు తమ్ముళ్లు అతనిని నిలదీశారు. టిడిపి అధికారంలోకి వచ్చాక టిడిపి కోవర్టుగా మారి పార్టీని అప్రతిష్టపాలు చేస్తున్నారని ప్రశ్నించారు. తెలుగు తమ్ముళ్లు ప్రహ్లాద రెడ్డి మధ్య మాట పెరిగి గొడవకు దారితీసింది. దీంతో సమావేశం వద్ద వీరు ఇరువురు గొడవకు దిగడంతో సమావేశం రసాబాసగా మారింది. ప్రహ్లాద రెడ్డి టిడిపి కోవర్టుగా మారారని అతనిపై అధిష్టానం చర్యలు తీసుకోవాలని మండిపడినట్లు తెలిసింది. అయితే ప్రసాద్ రెడ్డి మాత్రం ఎవరు ఎలాంటి వారో ఎలాంటివారో తెలుసుకోవాలని అనవసర రాద్ధాంతం చేయడం తగదని అక్కడి నుంచి వెళ్ళిపోయారు.



## మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం ర్యాలీ

పోరుమామిళ్ల రూరల్, జూన్ 26 ప్రభాతవార్త:

మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఈ రోజు (యాంటీ డ్రగ్ అబ్యూస్ ర్యాలీ) మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన కల్పించడానికి గురువారం ర్యాలీ నిర్వహించారు. ఇది సమాజంలో మాదకద్రవ్యాల నివారణకు, వాటి నుంచి యువతను దూరంగా ఉంచడానికి ఉద్దేశించిన ఒక ముఖ్యమైన సామాజిక చొరవతో ప్రజల్లో చైతన్యం నింపేలా, పోలీసులు, డాక్టర్లు, ప్రభుత్వ అధికారులు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ప్రజా సంఘాల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం పోరుమామిళ్ల టౌన్ లోని గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 3:30 గంటలకు జూనియర్ కాలేజీ నందు ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీనివాసులు ఎస్సై వెంకట కొండారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.



## గంజాయి రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

రాజుపాళెం, జూన్ 26, ప్రభాతవార్త:

గంజాయి రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను చేయుటకు అందరం తమ వంతు బాధ్యతగా నడుం బిగిద్దాం అని ఎస్ఐ వెంకటరమణ అన్నారు. మండల కేంద్రమైన రాజుపాళెంలో గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్వాడి కేంద్రాల నిర్వాహకులతో కలిసి ర్యాలీ నిర్వహించి గంజాయి రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను చేద్దాం అని నినాదాలు చేశారు. గ్రామాల్లో ఎక్కడైన గంజాయిని కానీ ఇతరత్ర మత్తు పధ్ధార్థాలను వాడటంకాని, విక్రయించడం కాని గుర్తించినట్లు అయితే బాధ్యతగా సమాచారం పోలీసులకు ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు.



## యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటేనే భవిష్యత్తు




**లక్కిరెడ్డిపల్లి జూన్ 26 ప్రభాతవార్త**

యువత చెడు అలవాటుకు దూరంగా ఉంటేనే మంచిబి భవిష్యత్తు ఉంటుందని ఎంపీడీవో ఉషారాణి ఎక్సైజ్ సీఐ కిషోర్ కుమార్ ఇల్లు పేర్కొన్నారు ప్రపంచ మాదక ద్రవ్యాల దినోత్సవం పురస్కరించుకొని గురువారం అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ కార్యాల పనిచేసే సిబ్బంది స్థానిక తాసిల్దార్ కార్యాల నుంచి మూడు రోడ్ల కోడల వరకు ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఎడదారి పట్టకుండా మంచి మార్గంలో నడవాలని వారి కోరారు ఈ మధ్యకాలంలో చాలామంది యువత డ్రగ్స్ కు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటారని వారు అన్నారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ క్రాంతి కుమార్ ఎంఈఓ చక్రి నాయక్ వెంకటసుబ్బయ్య ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు

## డ్రగ్స్‌పై అవగాహన కల్పించాలి



కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

**కురబలకోట, జూన్ 26 ప్రభాతవార్త :**

మాదకద్రవ్యాల వినియోగంపై కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలని మదనపల్లె రూరల్ సిఐ సత్యనారాయణ అన్నారు. గురువారం విశ్వం డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ డ్రగ్స్ డే పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని భవిష్యత్తును నాశనం చేసుకోరాదని హితవు పలికారు. తహశీల్దార్ ధనుంజనేయులు మాట్లాడుతూ ఎన్‌డిపిఎస్ యాక్టు ద్వారా డ్రగ్స్ అమ్మినా, రవాణా చేసిన, కలిగియున్న శిక్షార్హులు అవుతారని తెలిపారు. విశ్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రఘునాథ్‌రెడ్డి, ఎంపిడిఓ గంగయ్య ఎస్ఐ దిలీఫ్‌కుమార్, ఎంఈఓ ద్వారకనాథ్, ఎంపిపి భూదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు, అధ్యాపకులచే ప్రతిజ్ఞ చేయించారు.

## అంగళ్ళు పురవీధుల్లో ర్యాలీ




ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**కురబలకోట, జూన్ 26 ప్రభాతవార్త :**

డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జీవిఐసి విద్యాసంస్థల చైర్మెన్ ఎన్‌వి.రమణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం అంతర్జాతీయ డ్రగ్స్‌రోజును పురష్కరించుకొని కళాశాల విద్యార్థులు కళాశాల నుంచి అంగళ్ళు పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం వల్ల యువత చెడుమార్గం వైపు వెళ్ళి భవిష్యత్తును నాశనం చేసుకొంటోందని వాటికి దూరంగా ఉండాలన్నారు. మదనపల్లె రూరల్ సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ డ్రగ్స్‌ను రవాణాచేసినా, కలిగియున్న, కొనుగోలు చేసినా చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. డ్రగ్స్ రవాణాపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు. తహశీల్దార్ దనంజనేయులు మాట్లాడుతూ కళాశాలలో డ్రగ్స్‌పై ఫ్లెక్సీలు, అవగాహన సదస్సులు, డిస్‌ప్లేలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం ర్యాలీని తహశీల్దార్, రూరల్ సిఐ జెండాఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముదివేడు ఎస్ఐ దిలీఫ్‌కుమార్, ఆర్ఐ శేషాద్రిరావు, విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## నట్టల నివారణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి



**చిన్నమండెం జూన్ 26 ప్రభాతవార్త:**

మండలంలో జరుగుతున్న సామూహిక గొర్రెల మేకల నట్టల నివారణ కార్యక్రమాన్ని గొర్రెల కాపరులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా మండలం లోని అన్ని పంచాయితీ లలో నిగొఱ్ఱెలు మేకలకు నట్టల నివారణ కార్యక్రమం లో భాగంగా గురువారం పడమటి కోన లోని గొర్రెల కాపారులకు డాక్టర్ ,వెటర్నరీ అసిస్టెంట్ వేమలత దేవార్మింగ్ మందులు సరఫరా చేయడం జరిగింది. మండలంలోని అందరూ గొర్రెల కాపరులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## తంబళ్లపల్లె అభివృద్ధే లక్ష్యంగా పనిచేయండి.

**తంబళ్లపల్లె జూన్ 26 ప్రభాతవార్త :**

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తమ వంతు పూర్తి సహకారం అందించాలని తంబళ్లపల్లె టిడిపి ఇన్చార్జ్ దాసరిపల్లి జయచంద్ర రెడ్డి టిడిపి నాయకులకు సూచించారు. గురువారం పార్టీ ప్రధాన కార్యాలయంలో తంబళ్లపల్లె మండలం గుండ్లపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డప్ప నాయుడు, నాయకులు జయ చంద్రారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గం లో జరుగుతున్న పార్టీ పరిశీలకుల అభిప్రాయ సేకరణకు అందరూ సహకరించాలన్నారు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు మారుపేరని ప్రతి ఒక్కరూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేయాలని సూచించారు. పార్టీ పదవులు రాని వారు బాధపడరాదని భవిష్యత్తులో పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రతి తెలుగుదేశం కార్యకర్త విభేదాలు మరిచి ఐకమత్యంతో ప్రభుత్వ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. గత ఐదేళ్ల వైకాపా అరాచక పాలన ఎండ గడుతూ కూటమి పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రతి ఇంటి గడపలో తెలియజేయాల్సిన బాధ్యత మీదేనన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రజాభిమానం పొంది తిరుగులేని మెజారిటీ సాధించి వైకాపా ను చావు దెబ్బ తీయాలని ఉత్తేజపరిచారు. నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులు తమ పరిధిలో తెలుగుదేశం పార్టీ బలోపేతం చేయడానికి కృషి చేయాలని ప్రతి టిడిపి కుటుంబ సభ్యుల్ని కలుపుకుని ఐకమత్యంతో ప్రజల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట తంబళ్లపల్లె సమన్వయకర్త సీడ్ మల్లికార్జున నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ రెడ్డికోట బి.ఎం.ఆర్,మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ నాయుడు, రామ్మోహన్ తంబళ్లపల్లె మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



## మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలి



**పెనగలూరు జూన్ 26 ప్రభాతవార్త**

యువత మత ప్రార్ధన వినియోగానికి దూరంగా ఉండాలని పెనగలూరు ఎస్సై బి రవిప్రకాష్‌రెడ్డి, పీహెచ్సీ డాక్టరు శ్రేయ, తాసిల్దారు డి అమరేశ్వరి, ఎంపీడీవో ఎస్ విజయ రావు అన్నారు. ప్రపంచ మత్తుదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల చెడు వ్యసనాలు, దురాలవాట్లు, మానసిక రుగ్మతలు కలుగుతాయి అన్నారు. వీటి కారణంగా బంధాలు బంధుత్వాలను కూడా మరిచిపోయి సమావేశానంతరం ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ పాఠశాల, కళాశాల, పెనగలూరు ఉన్నత పాఠశాలలకు చెందిన 12 వందలమంది విద్యార్థులతో అధికారులు బస్టాండ్ లోని మూడు రోడ్ల కోడల వరకు కిలోమీటర్ దూరం ర్యాలీ నిర్వహించి మూడు రద్దు కోడలు మానవహారం గా ఏర్పడి డ్రగ్స్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం నిరంజన్ కుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయకుమారి, పోలీసు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## మండలాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తా.

### ఇంచార్జ్ ఎంపీడీవో థామస్ రాజా.



**తంబళ్లపల్లె జూన్ 26 ప్రభాతవార్త :**

మండలం లో పారిశుధ్యం మెరుగు తోపాటు అన్ని రంగాలలో అధికార పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో మండలాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తానని ఇన్చార్జి ఎంపిడిఓ థామస్ రాజా ధీమా వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 12 సచివాలయాలు పరిధిలోని పంచాయతీల మారుమూల గ్రామాలలో ఎప్పటికప్పుడు పారిశుధ్యం మెరుగు పరచడంతో పాటు తాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి, తదితర అంశాలపై దృష్టి సారించనున్నట్లు చెప్పారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించి ప్రతినిత్యం క్షేత్ర స్థాయిలో సమస్యలను గుర్తించి ప్రభుత్వ అభివృద్ధి పథకాలు ప్రజలకు అవగాహన కల్పించి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు.

## గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్ గుప్త



**కె.వి.పల్లి జూన్ 26 ప్రభాతవార్త :**

కేవీ పల్లి మండలంలోని గ్యారంపల్లి ఏపీ గురుకుల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్న డాక్టర్ ఎం. చెన్నకేశవులు తిరుపతి జిల్లాలోని వెంకటగిరి ఏపీ గురుకుల జూనియర్ కళాశాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అదే కళాశాలలో పనిచేస్తున్న సీనియర్ లెక్చరర్ డాక్టర్ జయం శ్రీనివాస గుప్తా ఏపీ రెసిడెన్షియల్ సొసైటీ సెక్రటరీ ఆదేశాల మేరకు ఎఫ్‌ఏసి ప్రిన్సిపాల్ గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి తన వంతు సహాయం చేస్తానని, ఎప్పటిలాగా ఫలితాలు నూరు శాతం సాధించడానికి విద్యార్థులలో క్రమశిక్షణ, నైపుణ్యాలు పెంచడానికి అధ్యాపకులందరూ సహకరించాలని కోరారు.

## పరామర్శ

**కాశినాయన, జూన్ 26 ప్రభాతవార్త :**



మండలము కోడిగుడ్లపాడు గ్రామపంచాయతీ చెందిన YSRCP ముఖ్య నాయకులు తల్లపురెడ్డి గురుశేఖర్ రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై కడప హాస్పిటల్ నందు చికిత్స పొంది ప్రస్తుతం వారి నివాసం నందు విశ్రాంతి తీసుకుంటున్నారు. గురుశేఖర్‌రెడ్డిని బద్వేల్ నియోజకవర్గ YSRCP అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి వారి నివాసం నందు కలసి పరామర్శించడం జరిగినది. ఈ సందర్భముగా ప్రస్తుత ఆరోగ్య పరిస్థితుల గురించి చర్చించడం జరిగినది. ఈ కార్యక్రమములో కాశినాయన మండల YSRCP ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొనడం జరిగినది.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం




**రామాపురం జూన్ 26 ప్రభాతవార్త**

మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం ఆరోగ్యవంతంగా జీవిద్దామని మండల అధికారులు తాసిల్దార్ వెంకటేశ్వర్లు ఎంపీడీవో జాషువా ఎంఈఓ రామకృష్ణుడు ఎంఈఓ2 జయచంద్ర మండల వైద్యాధికారి వినోద్ కుమార్ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ వెంకట సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు అంతర్జాతీయ మత్తు పదార్థాలవినియోగవ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయం నుండి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీగా వెళ్లి మూడు రోడ్లకూ డలిలో మానవహారం నిర్వహించారు సందర్భంగా మాట్లాడుతూ మత్తు పదార్థాలకు వాడకంవల్ల కలిగే అనర్థాలు ఆరోగ్య ఆర్థిక సమస్యలు సమాజంలో వారి పట్ల కలిగే చిన్న చూపు తదితరుశాలపై అధికారులు విషతీకరించారు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు హుస్సేనమ్మ సుజాత ఉపాధిహామీ ఏపీఓ పెంచలయ్య టిఏ లు వెలుగు ఏపిఎం దేవయాని వెలుగు సిసిలు ఉపాధి వెలుగు సిబ్బంది స్థానిక మోడల్ స్కూల్ వెంకటేశ్వర స్కూల్ గౌతమ్ స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఏకిలపల్లె లో సుబ్బారెడ్డిని పరామర్శించిన శ్రీకాంత్ రెడ్డి

**రామాపురం జూన్ 26 ప్రభాతవార్త**

మండలం చిట్లూరు గ్రామం ఏకిలపల్లె కు చెందిన సుబ్బారెడ్డిని వై ఎస్ ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి పరామర్శించారు. గురువారం ఏకిలపల్లె లో వారి నివాసానికి శ్రీకాంత్ రెడ్డి వెళ్లి సుబ్బారెడ్డి ని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.



## జగనన్న పాలనలో యువతకు పెద్దపీట



**రామాపురం జూన్ 26 ప్రభాతవార్త**

జగనన్న పాలనలో యువతకు పెద్ద పీట వేశారని వైఎస్ఆర్సిపి జనరల్ సెక్రెటరీ మాజీ ఎమ్మెల్యే గడ్డికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు మండలంలోని పంచాయతీ ఎర్రం రెడ్డి గారి పల్లి తన స్వగృహంలో గురువారం కలిసిన చిట్లూరు గ్రామ యువత ఉద్దేశించి ఆయన అన్నారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఆశ శ్వాస యువతని వైఎస్ఆర్సిపి యువతకు ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు కూటమిప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను ఏడాది గడిచిపోయిన సూపర్ సిక్స్ అమలు చేయలేదని విమర్శించారు కూటమిమేనిఫెస్టో ప్రజల్లోకి తీసి వెళ్లి మహిళలకు సంక్షేమ పథకాలు చంద్రబాబు నాయుడు చేసిన మోసపూరిత హామీలను వివరించాలన్నారు చిట్లూరు మాజీ సర్పంచ్ మురళీమోహన్ రెడ్డి మాజీ ఎంపీటీసీ హరినాథ్ రెడ్డి వైఎస్ఆర్సిపి పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గాలివీడు ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆదిరెడ్డి వైఎస్ఆర్సిపి మండల యూత్ లీడర్ అయోధ్య పురం పవన్ కుమార్ రెడ్డి జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ విభాగం మాజీ సభ్యుడు సగినాలా శివశంకర్ చిట్లూరు ఎస్సీ సెల్ విభాగం నాయకులు పాల్గొన్నారు

## విద్యుత్ షార్ట్ తో ఇల్లు దగ్ధం 15లక్షల ఆస్తినష్టం

**రామాపురం జూన్ 26 ప్రభాతవార్త**



విద్యుత్ షాక్ తో ఇల్లు దగ్ధం కాగా 15 లక్షల ఆస్తి నష్టం వాటిలినట్లు బాధితుడు రాం చెన్నారెడ్డి వాపోయాడు మండలంలోని బండపల్లి పంచాయతీ వెంకటరెడ్డిగారిపల్లె రామ్ చెన్నారెడ్డి బుధవారం రాత్రి ఇంట్లో జరిగిన విద్యుత్ షార్యోడ్ వల్ల మంటలు వ్యాపించి ఇంట్లోని వస్తువులు బూడిద పాలు అయ్యాయి అన్నారు రెండు సోఫాలు 40 పట్టు చీరలు బంగారు1.50 లక్షల నగదు రెండు డబల్ కాట్ మంచాలు కాలి వంట సామాగ్రి బూడిద అయ్యాయన్నారు లక్కిరెడ్డిపల్లి ఫైర్ స్టేషన్ కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు అప్పటికే జరగవలసిన నష్టం జరిగిందని బాధితులు వాపోయారు ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు వాపోయారు.

## నట్టల నివారణ కార్యక్రమం విజయవంతం



**కలికిరి, జూన్ 26, ప్రభాతవార్త:**

ఏపీ ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ తరుపున రాష్ట్ర మంతా జీవాలలో నట్టల నివారణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. గురువారం నుంచి జులై 10 వరకు జరగనుంది. పత్తేగడ గ్రామ పంచాయతీ పల్లెలవారిపల్లెలో ఈ కార్యక్రమ ప్రారంభోత్సవం పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు కె.వెంకటముని నాయుడు చేతుల మీదుగా జరిగింది. జీవాల పెంపకం దారులతో మాట్లాడుతూ ప్రభుత్వం తరుపున సరఫరా జరుగుతున్న ఈ నట్టల నివారణ మందులు ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాలానుగుణంగా జీవాలలో టీకాలు క్రమం తప్పకుండా వేసుకొని జీవాలను వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీవాల పెంపకందారుల కోసం మినీ గోకులం పథకం తెచ్చిందన్నారు. ఈ పథకంలో భాగంగా ఆసక్తి ఉన్న రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా మందలో పొట్టేళ్లను క్రమం తప్పకుండా మార్చాలన్నారు. దీని వలన పుట్టే పిల్లల్లో జన్యు లోపాలు నివారించబడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు డా.కీర్తి, డా.గిరినాథ్‌రెడ్డి, సిబ్బంది సయ్యద్ అలీ, పశు సహాయకుడు రాజ్‌కుమార్, లోకల్ నాయకులు ఎర్రయ్య పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల దినోత్సవం సందర్భంగా ర్యాలీ



**ప్రొద్దుటూరు క్రైం, జూన్ 26, ప్రభాతవార్త:**

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల (డ్రగ్స్) దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ మైదానం నందు ప్రొద్దుటూరు డీఎస్పీ భావన స్కూలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడడం వలన కలిగే అనర్థాలు వివరించారు. మైదానంలో నో డ్రగ్స్ ఆకారంలో విద్యార్థులు మానవ హారంగా నిలబడ్డారు. అనంతరం పట్టణంలోని పలు కూడళ్లలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రూపానంద్, ప్రొద్దుటూరు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్, ఎన్టీఆర్ వైద్య సేవ ఎగ్జిక్యూటీవ్ కమిటీ సభ్యులు డా.టీడీ వరుణ్‌కుమార్‌రెడ్డి, ఎంబీబీఎస్, ఎండీలు తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోండి,

**మైదుకూరు, జూన్ 26, ప్రభాతవార్త:**

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు మత్తు వదలండి.. మీ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుంటూ చదువులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని నియోజకవర్గ ప్రజలకు, విద్యార్థి, విద్యార్థులకు యువతకు నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, డిఎస్పి రాజేంద్రప్రసాద్, తహసిల్దార్ రాజసింహ నరేంద్ర పిలుపునిచ్చారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కడప రోడ్డు ఎంపీడీవో ఆఫీసు నుండి శ్రీకృష్ణదేవరాయలు సర్కిల్, మీదుగా అమ్మవారి శాల వరకు ర్యాలీగా విద్యార్థుల నినాదాలతో ప్ల కార్డులు పట్టుకొని మత్తు వదలండి అంటూ నినాదాలు చేశారు. ఎమ్మార్వో రాజసింహ నరేంద్ర విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థుల్లో చైతన్యం రావాలని ఎప్పుడైతే దీనిపై విద్యార్థులకు అవగాహన ఉంటుందో వారి కుటుంబంలో మార్పు లు చెందుతాయని వారి జీవితాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో అర్బన్ సిఐ కె.రమణారెడ్డి,ఎక్సైజ్ సిఐ ఎస్. ధీరజ్ రెడ్డి, ఇతర సీఐ, ఎస్సై లు,మెడికల్ హెల్త్ డిపార్ట్మెంట్, డాక్టర్స్, మేధా కాలేజ్ నరసింహులు, పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, మున్సిపాలిటీ చైర్మన్ మాచనూరు చంద్ర, మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాసులు రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ భీమయ్య, పట్టణ మెడికల్ స్టోర్స్ సిబ్బంది, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది, ఎక్సైజ్ పోలీస్ సిబ్బంది, ఫారెస్ట్ సిబ్బంది, ఆశ వర్కర్స్, ఏఎన్ఎం, మెడికల్ డిపార్ట్మెంట్ సిబ్బంది, నియోజకవర్గం అధికారులు, పోలీస్ సిబ్బంది, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.



## నాణ్యతతో రోడ్డు నిర్మాణం..

**కడప కార్పొరేషన్ జూన్ 26 ప్రభాతవార్త:**



వైకాపాలనలో కడప నగరం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని, సిసి రోడ్లు డ్రైనేజీలు వరద కాలువలు నిర్మించడం జరిగిందని 20 డివిజన్ వైసీపీ ఇంచార్జ్ శ్రీరంజన్ రెడ్డి అన్నారు. కడప నగరంలో 20వ డివిజన్ లో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను డివిజన్ వైసీపీ ఇంచార్జ్ శ్రీరంజన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా అయినా మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి కావాల్సిన నిధులను మంజూరు చేసినమేయర్ సురేష్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్ ను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడం జరిగిందినీ, భవిష్యత్తులో మరింతగా అభివృద్ధి చేసి ప్రజల మన్ననలు పొందుతామని చెప్పారు.

## యువత మత్తుకు చిత్తు కావొద్దు



**ఓబులవారిపల్లి జూన్ 26 ప్రభాతవార్త**

సమాజంలో యువత పాత్ర ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది యువకులు బాగుంటే దేశ భవిష్యత్తు బాగుంటుందని అందువల్ల మత్తు వద్దు చదివే ముద్దు అని ఓబులవారిపల్లి ఎస్సై మహేష్ సూచించారు గురువారం మండల పరిధిలోని చిన్న వరంపాడు జూనియర్ కళాశాలలో నిర్వహించిన మాదకద్రవ్యాల నిర్మూలన కార్యక్రమ పై ఆయన యువత ఉద్దేశించి మాట్లాడారు యువత మేలుకో యువతీ యువకులు డ్రగ్స్ గంజాయి తదితర వ్యసనాలుకు లోను కాకుండా బాగా చదివి దేశ భవిష్యత్తు కోసం కష్టపడి మంచి ఉన్నత శిఖరాలను చేరుకుని మీ జీవితాలను సుఖాంతం చేసుకోవాలని ఆయన సూచించారు నేటి సమాజంలో యువత చెడు దారి పట్టణం తల్లిదండ్రులు సంపాదనపైన జీవిస్తూ వారికి ఎటువంటి ఉపయోగాలు లేకుండా గాలి తిరుగుళ్ళు తిరగడం మానేసి మంచిగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు అనంతరం ఓబులవారిపల్లి చిన్న వరంపాడు తదితర ప్రాంతాలలో మాదకద్రవ్యాలు నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ యామిని రెడ్డి ఎంపీడీవో మర్రెడ్డి పిఏపిఆర్డి రామ్మోహన్ రెడ్డి ఏపీవో మల్లికార్జున రాజు పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ ఐసిడిఎస్ సూపర్వైజర్ అనసూయమ్మ వెలుగు సిబ్బంది అంగన్వాడి కార్యకర్తలు ఉపాధ్యాయులు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాల కోసం ఘర్షణలు

### దాడి చేసిన వారిపై కేసు నమోదు

**ఓబులవారిపల్లి, జూన్ 26 ప్రభాతవార్త**



మండలంలో రోజురోజుకు ప్రభుత్వ స్థలాల కోసం కొందరు వ్యక్తులు ఘర్షణలకు దిగుతూనే ఉన్నారు గురువారం మండల పరిధిలోని ముక్కు వారి పల్లి పంచాయతీకి చెందిన రమాదేవి, సతీష్. అనే వ్యక్తులపై అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు, నరసింహ మరో వ్యక్తి మరికొందరు కలిసి దాడి చేసిన సంఘటనలు తీవ్ర గాయాలు పాలు కావడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్సై మహేష్ తెలిపారు ఆయన కథనం మేరకు వివరాలు ఇలాఉన్నాయి గత కొంతకాలంగా ఇదే గ్రామంలో ప్రభుత్వ స్థలాల కోసం విడతల వారీగా కుటుంబాల వారీగా గొడవలు చేసుకుంటున్నారని సమాచారం తెలిసిందని కానీ రౌడీయిజంతో పలుమార్లు కొందరిని దాడిలు చేసి ఘర్షణలకు దిగిన సంఘటన ఉండడంతో పై వారిపై కేసులు నమోదు చేసి చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు ఇకపై గొడవలకు దారి తీసిన గొడవలకు పురుగులుపిన చట్టబద్ధమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షిస్తామని గ్రామాలలో ప్రశాంత వాతావరణం కావాలని మా ఉద్దేశం అని ఆయన తెలిపారు.

## జాతీయ ఉత్కర్ష అభియాన్‌పై అవగాహన సదస్సు



**పెండ్లిమర్రి, జూన్ 26, ప్రభాతవార్త:**

కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని గంగనపల్లి సచివాలయం, నీరు కోన యానాది కాలనీలో ధాత్రి జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి సురేంద్రనాథ్‌రెడ్డి ప్రజలకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఆధార్ కార్డులు, రేషన్ కారులు, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు, రెవెన్యూ సర్టిఫికెట్లు, పీఎం కిసాన్ జన్ ధన్ ఖాతాలు ఉచిత విద్యుత్తు తదితర సమస్యలపై ప్రజల సమస్యలు పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని అధికారులు, యానాది కాలనీ ప్రజలు అందరితో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో పలు సమస్యలను గుర్తించడం జరిగింది.

## ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్య చర్యలు పాటించాలి



**పెండ్లిమర్రి, జూన్ 26, ప్రభాతవార్త:**

ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అలాగే వ్యక్తి పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన గ్రామాల్లోని పలు వీధుల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య కార్మికులతో వీధులను శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## 28న తలనీలాల పోగు వేలం పాట

**పెండ్లిమర్రి, జూన్ 26, ప్రభాతవార్త:**

మండలంలోని నందిమండలం గ్రామంలో వెలసిన శ్రీ కొండ గంగమ్మ దేవస్థానం వద్ద భక్తాదులచే వచ్చే తలనీలాలు పోగు చేసుకొని అమ్ముకొనే హక్కుకు గాను ఈనెల 28న వేలం పాటను ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఈవో మారుతీ ప్రసాద్ యాదవ్ తెలిపారు. పాటలో పాల్గొను వారు రూ.50వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు.

## ఎమ్మార్వోగా బాధ్యతలు స్వీకరణ

ముద్దనూరు, జూన్ 26, ప్రభాతవార్త:



మండల తహసిల్దార్ కార్యాలయంలో నాడు ఎండి అలీ ఖాన్ తాసిల్దారుగా బాధ్యతలు స్వీకరణ. కడప తాసిల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీలలో భాగంగా బదిలీపై వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీటీ వరద కిషోర్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. తాసిల్దార్ మాట్లాడుతూ మండలంలో రైతులకు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే, పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలనే ధ్యేయం




ముద్దనూరు, జూన్ 26, ప్రభాతవార్త:

మాదక ద్రవ్యాల నిర్మలనే ధ్యేయంగా నేటి యువత అవగాహన కలిగి ఉండాలని గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ సందర్భంగా బాలుర ఉన్నత పాఠశాల ఆవరణ నుంచి పాత బస్టాండ్ కుడలి వరకు అవగాహన ర్యాలీ చేపట్టి, కూడలిలో ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని ఎక్సైజ్ సీఐ విన్నీ లత ఆధ్వర్యంలో చేపట్టారు. నేటి యువత మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే అనార్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మైనుద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ



రైల్వేకోడూరు రూరల్, జూన్ 26, ప్రభాతవార్త:

మాదక ద్రవ్యలకు వ్యతిరేకంగా రైల్వేకోడూరు పట్టణములో ఎంపీడీఓ నాగార్జున తహసీల్దార్ అమర్నాథ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా తహసీల్దార్ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు విద్యార్థులుతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ సమాజంలోని పౌరలు మత్తు వద్దు భవిష్యత్ ముద్దు అని అందరూ తెలుసుకోవాలి అని మత్తుకు మాదక ద్రవ్యలకు యువత దూరంగా ఉండాలని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మత్తు పద్దర్థాలను దూరంగా పెట్టాలని ఎవరైనా అటువంటి వాటి జోలికి వెళితే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరిస్తున్నారు అని వారు పేర్కొన్నారు. యువత ఎవరైనా వాటి జోలికి వెళితే కేసులు చెర్యలు ఉంటాయి అని తెలిపారు. రైల్వే కోడూరు మండలంలో మాదక ద్రవ్యలు పై పోలీసులు దాడులు నిర్వహిస్తున్నారు అని వారు పేర్కొన్నారు.. ఈ కార్యక్రంలో మత్తు జోలికి వెళ్ళొదు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు అంటూ నినాదలు చేసారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నర్జలా హేమరాజ్, పోతురాజు నవీన్, ఉంగరల బ్రదర్స్, వెలుగు ఏపీఎం వసుంధర, ఐసీడిస్ ప్రభుత్వ బాలికల హైస్కూల్ షిరిడి సాయి జూనియర్ కళాశాల, శ్రీ వెంకటేశ్వర కళాశాల విద్యార్థులు తదితరులుతో పాటు సీఐ హేమ చందర్ యస్ఐ లక్ష్మీప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అయిదు లీటర్ల నాటుసారా, ఒకరు అరెస్ట్

రైల్వేకోడూరు రూరల్, జూన్ 26, ప్రభాతవార్త:



మండలంలోని డెశెట్టిపల్లి అటవీ సమీప ప్రాంతంలో పి చెంచు రామయ్య నుండి అయుదు లీటర్ల నాటు సారను స్వాధీనం చేస్కొని కేసు నమోదు చేసినట్లు ఎక్సయిజ్ సిఐ టీకే తులసి తెలిపారు. ఈ సందర్బంగా ఆమె విలేకర్లోతో మాట్లాడుతూ సారా వివరాలను తెలియచేసిన వారి పేర్లు గోప్యాంగా ఉంచాబడుతాయి అని తెలిపారు. సారాయి జోలికి వెళితే శాఖ పరమైన కఠిన చర్యలు ఉంటాయి అని హెచ్చరించారు. ఈ దాడులో హెడ్ కానిస్టేబులు చంద్ర శేఖర్, శ్రీనివాసులు, మధు సుధన్ రాజు, సోమేశ్వర్, రమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నిందుతుడిని రిమాండుకు తరలిస్తునట్టు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

మదనపల్లె క్రైమ్, జూన్ 26 ప్రభాతవార్త.



రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన విషాదకర సంఘటన మదనపల్లిలో చోటు చేసుకుంది. మదనపల్లె తాలూకా పోలీసుల కథనం మేరకు వివరాలు ఎలా ఉన్నాయి. బి.కొత్తకోట మండలం, గట్టు గ్రామం, పత్రువారిపల్లెకి చెందిన దార కృష్ణమూర్తి కొడుకు డి.హరీష్(24) సొంత పనిపై పుంగనూరు కు బైక్ పై వెళ్ళాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి అదే బైకులో ఇంటికి వస్తుండగా, మార్గ మధ్యంలోని మదనపల్లె మండలం, వలసపల్లె గ్రామం, బోయకొండ ఆర్చి వద్ద మదనపల్లి పట్టణం రామారావు కాలనీకి చెందిన యువకుడు స్వామినాథ్(24) బైక్‌తో ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో హరీష్, స్వామినాథ్ లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే హరీష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గాయపడిన స్వామినాథ జిల్లా ఆసుపత్రిలో చికిత్సలు చేస్తున్నారు. తాలూకా ఎస్ ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్ విధించిన ఎమర్జెన్సీకి 50 ఏళ్లు..

కడప కార్పొరేషన్, జూన్ 26 ప్రభాతవార్త:

ప్రజాస్వామ్యాన్ని హరించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని బీజేపీ కడప జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకట సుబ్బారెడ్డి విమర్శించారు. కడప బిజెపి కార్యాలయంలో మీడియా సమావేశంలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ 1975లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరా విధించిన ఎమర్జెన్సీ 50 ఏళ్ల గడిచిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ విధించి ప్రతిపక్ష నాయకులను, జాతీయ వాదులను, మహిళలను జైలులో బంధించారని గుర్తు చేశారు. మీడియాపై ఆంక్షలు విధించారని తెలిపారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మారుస్తుందని ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీ ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు పరుస్తూ మోదీ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. 11 సంవత్సరాల మోదీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను మోదీ అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బిజెపి నేతలు లక్ష్మణరావు, నాగిరెడ్డి, డా. శివ నాయక్, ఓబులేసు, సురేంద్ర, ప్రవీణ్ సాయి పాల్గొన్నారు.



## రామ్‌దేవ్ బాబాకు బిజెపి నాయకులు ఘనస్వాగతం



స్వాగతం పలుకుతున్న దృశ్యం

మదనపల్లె, జూన్ 26 ప్రభాతవార్త :

హార్సిలీహిల్స్ పర్యటనలో భాగంగా హెలిక్యాప్టర్‌లో మదనపల్లెకు విచ్చేసిన యోగా గురువు రామ్‌దేవ్ బాబాకు గురువారం హెలిప్యాడ్‌లో బిజెపి నాయకులు పుష్పగుచ్చం అందజేసి ఘన స్వాగతం పలికారు. బిజెపి నాయకులు విజయభారతిస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు, బండి ఆనంద్, భగవాన్, పిళ్ళస్వామినాయక్‌లు పుష్పగుచ్చాలు అందజేసి రామ్‌దేవ్ బాబాను ఘనంగా స్వాగతించారు. అనంతరం ఆయన హార్సిలీహిల్స్‌కు రోడ్డు మార్గాన వెళ్ళారు. హార్సిలీహిల్స్‌లో అంతర్జాతీయ ఆద్యాత్మిక యోగా కేంద్రాన్ని ఏర్పాటుకు స్థల పరిశీలన నిమిత్తం వెళ్లారు. రోడ్డు పొడవునా ఆయనకు పలువురు బిజెపి నాయకులు స్వాగతించారు.

## హార్సిలీహిల్స్ రామ్‌దేవ్‌కు కట్టపెడితే పోరాటం తప్పదు

### సిపిఎం, సిపిఐ నాయకులు

మదనపల్లె, జూన్ 26 ప్రభాతవార్త :

ప్రముఖ పర్యాటక కేంద్ర హార్సిలీహిల్స్‌ను యోగా గురువు రామ్‌దేవ్ బాబాకు కట్టపెడితే పోరాటం తప్పదని సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సిపిఐ నాయకులు మురళి, క్రిష్ణప్పలు తెలిపారు. గురువారం వారు వేర్వేరుగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో హెచ్చరించారు. మదనపల్లెకు విచ్చేసిన బాబా రామ్‌దేవ్‌కు అధికారులు స్వాగతం పలికిన తీరు ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. ఏ అధికారిక హోదాలేని వ్యక్తికి అధికారులు స్వాగతం పలకడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో హార్సిలీహిల్స్‌ను వైసిపి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకించిన కూటమి ప్రభుత్వం పతాంజలి కార్పోరేట్ సంస్థకు అప్పగించడానికి అరులు చాచడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికే హార్సిలీహిల్స్‌లో ఉన్న చిన్న చిన్న వ్యాపారస్తులు పతాంజలి సంస్థ ప్రవేశంతో జీవనోపాధి కోల్పోతారన్నారు. హార్సిలీహిల్స్‌పై కార్పోరేట్ దొంగలు పడుతున్నారని ఆరోపించారు. హార్సిలీహిల్స్‌ను అభివృద్ధి చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కార్పోరేట్ సంస్థలకు రెడ్‌కార్పెట్ వేసి ఆహ్వానిస్తొందన్నారు. రామ్‌దేవ్ బాబా తన వ్యాపార విస్తరణ కోసం హార్సిలీ కొండను కాజేయడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే ఇటీవల అధికారులు హార్సిలీహిల్స్‌లో యోగాను నిర్వహించడం జరిగిందన్నారు. కొండపై ఒక్కసెంటు భూమి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించినా ప్రజాసంఘాలను, ప్రజలను కలుపుకొని పోరాటం చేస్తామన్నారు.

## తంబళ్లపల్లె పరిశీలకులుగా ఆర్‌జె.వెంకటేష్

మదనపల్లె, జూన్ 26 ప్రభాతవార్త :



తంబళ్ళపల్లె నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులుగా టిడిపి రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్ నియామకం అయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం నుంచి ఆయనకు ఆదేశాలు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తంబళ్ళపల్లె నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం వచ్చేలా కృషి చేస్తామన్నారు. పార్టీలో ఉన్న వారందరిని క్షేత్రస్థాయి నుంచి కలసి పార్టీని మరింత పటిష్టం చేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకిచెందిన అభ్యర్థులు విజయం పొందేలా కృషిచేస్తామన్నారు. పార్టీ అధిష్టానం మేరకు నియోజకవర్గమంతా పర్యటించి పార్టీ బలోపేతానికి కృషిచేస్తామన్నారు.

## 23వ రోజు కొనసాగిన కార్మికుల సమ్మె




దీక్షలో పాల్గొన్న కార్మికులు

మదనపల్లె, జూన్ 26 ప్రభాతవార్త :

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు గురువారం 23వ రోజు సమ్మెను యదావిధిగా కొనసాగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంజనీరింగ్ కార్మిక జేఏసి నాయకులు ఎంఎస్.కన్నయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు పూర్తిస్థాయిలో విధులు బహిష్కరించి సమ్మె చేపట్టడం జరిగిందన్నారు. పట్టణంలో, వీధి లైట్లు, తాగునీటి సరఫరాను బంద్ చేసి సమ్మె చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటిల్లోనూ శాంతియుత సమ్మె నిరసన చేస్తున్నా ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరి స్తొందన్నారు. ప్రభుత్వం ఇంజనీరింగ్ కార్మికులకు అన్యాయం చేస్తున్నదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు కూడా రాకుండా అన్యాయం చేస్తొందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ జేఏసి నాయకులు ఎస్‌కె.రెడ్డప్ప, నాగరాజు, గోపాల్‌క్రిష్ణ, సజాద్‌కుమార్, బాలక్రిష్ణ, కుమార్, మహేష్, ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

## వ్యాధులపై అవగాహన తప్పనిసరి



ముద్దనూరు, జూన్ 26, ప్రభాతవార్త:

పశువులు గొర్రెలలో నట్టల నివారణ ధ్యేయంగా పశు వైద్య సిబ్బంది పనిచేయాలని వేల్పుచర్ల పశువైద్యాధికారి శ్రీనివాస తెలిపారు. గురువారం మండల పరిధిలోని ఉప్పలూరు గ్రామంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించి గొర్రెలు మేకలలో నట్టల నివారణ కార్యక్రమాన్ని చేపట్టి పాడి రైతులకు పశువులలో వచ్చు వ్యాధులపై అవగాహన కల్పించారు. పశు వైద్యాధికారులు సూచనలు పాటిస్తే పాడి రైతులను అధిక పాల పోషణ పొంది అధిక ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని సందర్భంగా పేర్కొన్నారు. మండలంలో జులై 10వ తేదీ వరకు సామూహిక నట్టల నివారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మండల పాడి రైతులు తప్పక సద్వినియోగపరచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగు యువత అధ్యక్షుడుగా నల్లారి రియాజ్

పీలేరు జూన్ 26 ప్రభాతవార్త :



పీలేరు మండల తెలుగు యువత అధ్యక్షులుగా నల్లారి రియాజ్ ముచ్చటగా మూడోసారి ఎన్నికయ్యారు. తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఆయనకు మూడోసారి ఈ పదవి దక్కింది. గురువారం పీలేరులో ఆయన మాట్లాడుతూ నల్లారి కుటుంబానికి సన్నిహితుడిగా ఉంటూ, ప్రతి కార్యక్రమంలోనూ చురుగ్గా పాల్గొంటూ, మంచి గుర్తింపు పొందిన తనను ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మూడోసారి తెలుగు యువత మండల అధ్యక్షులుగా ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీకి కష్టకాలంలోనూ అండగా నిలబడి అప్పటి అధికార పార్టీకి ఎదురొడ్డి నిలిచిన కార్యకర్తలను గుర్తించి, వారి సేవలను దృష్టిలో ఉంచుకుని తనకు బాధ్యతగల పదవి ఇచ్చిన ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకున్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని యువతను ముందుకు నడిపిస్తూ, పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

# నిరుపేదల ఇళ్లకు ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలి

ప్రొద్దుటూరు జూన్ 26 ప్రభాతవార్త



ప్రొద్దుటూరు మండలం సోములవారిపల్లె పంచాయతీ పరిధిలోని ఈశ్వర్ రెడ్డి నగర్ లో గత 50 ఏళ్లుగా ఇళ్లను నిర్మించుకొని నివాసముంటున్న 300 కుటుంబాలను ఖాళీ చేసి వెళ్లాలని అటవీ శాఖ అధికారులు ఇచ్చిన నోటీసులను ఉపసంవత్సరించుకోవాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ శికిలిగిరి ఇర్ఫాన్ భాష డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఈశ్వర్ రెడ్డి నగర్ లో నివాసం ఉంటున్న కుటుంబాల సభ్యులతో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ దశాబ్దాలుగా పలువురు జీవనాధారం కోసం గృహాలు ఏర్పాటు చేసుకొని చేతి వృత్తులు స్వయం ఉపాధి దగ్గరలోని చిన్నపాటి పరిశ్రమల యందు పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్న 300 గృహాల కుటుంబ సభ్యులు ఉన్నారన్నారు సోములవారిపల్లె పంచాయతీ కార్యాలయంలో ఇంటి పన్నులు అలాగే విద్యుత్ మీటర్ల బిల్లులు చెల్లిస్తూ వస్తున్నారన్నారు ఈ నేపథ్యంలో వారు నివాసం ఏర్పరచుకున్న ప్రాంతం అటవీశాఖ పరిధిలోకి వస్తుందని తాజాగా ఆ 300 గృహాలకు నోటీసులు ఇచ్చి కాళీ చేయమనడం దుర్మార్గమన్నారు. కావున ప్రభుత్వం పునరాలోచన చేసి నోటీసులు ఉపసంహరించుకొని ప్రజలకు న్యాయం చేయాలని ఆయన కోరారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలకు అండగా ఉండి తగు న్యాయం జరిగేంత వరకు ప్రభుత్వంతో పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెంకటసుబ్బారెడ్డి డీసీసీ కార్యదర్శి అప్పుపొంగుల ఎల్లయ్య, సోషల్ మీడియా ఇంచార్జ్ అబ్బాస్, ఖలందరు, శామీర్, మోలాలి, గౌస్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలతో యువత జీవితాలు చిన్నాభిన్నం



గాలివీడు, జూన్ 26(ప్రభాతవార్త):

మాదక ద్రవ్యాలతో యువత జీవితాలు చిన్నాభిన్నం అవుతాయని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తహసీల్దార్ భాగ్యలత అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగం, అక్రమరవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్‌తో కలిసి స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, యువత మత్తుపదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు నాగరాజు, శ్రీనివాసులు, సచివాలయం, ఐసీడీఎస్, వైద్య, ఉపాధి, వెలుగు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అసంపూర్తి గృహాలు వెంటనే పూర్తి చేయాలి



గాలివీడు, జూన్ 26(ప్రభాతవార్త):

అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ చంద్రశేఖర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్, ఏఈ రమేష్‌నాయక్‌లతో కలిసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 180 మంది ఎస్సీ, బీసీలు ఆర్‌సీ దశలో ఉన్న వాల్లకు రూ.40 వేలు, ఎస్టీలకు రూ.50 వేలు చొప్పున ప్రభుత్వం అదనపు నిధులు లబ్దిదారుల ఖాతాలకు జమచేసినప్పటికీ ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. బీఎల్, ఆర్ఎల్, ఆర్‌సీ స్టేజ్‌లలో ఉన్న గృహాలు వచ్చే నెలలోపు పూర్తి చేసేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## అనుమతిలేని ప్లే స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలి

ఎడ్యుకేషన్ మే 26 ప్రభాతవార్త :



కడప మండల పరిధిలో అనుమతి లేని ప్రైవేట్ ప్లే స్కూల్స్ పై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం రెవల్యూషనరీ యూత్ ఫ్రంట్ ఆధ్వర్యంలో కడప మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం విద్యార్థి యువజన సంఘం నాయకులు సుబ్బరాయుడు భరత్ మాట్లాడుతూ SCERT వంటి ప్రభుత్వ ఆమోదిత పుస్తకాలను ఉపయోగించాలని నిబంధనలు వున్నా వానిని పాటించకుండా, CBSE, ఐఐటీ, ఇంటర్నేషనల్, మోడల్ స్కూల్ వంటి వివిధ కరికులం పేర్లతో ప్రైవేటు ప్రచురణల పుస్తకాలను విద్యార్థులకు తప్పనిసరిగా కొనుగోలు చేయమని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. పుస్తకాలు అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. ఒకటో తరగతికి పదో తరగతి వరకు రూ.5,000 నుంచి రూ.10000 వరకు వాసులు చేస్తున్నారాన్నారు. ఇది సామాన్య కుటుంబాలకు తీవ్ర ఆర్థిక భారంగా మారుతుందన్నారు. ఇంత జరుగుతున్న విద్యాశాఖ అధికారులు స్పందించకుండా ఉండడం దారుణం అన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి అనుమతి లేని ప్లే స్కూల్లో పై చర్యలు తీసుకొని అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేకపోతే ఎంఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు. ఈ కార్య ఈ కార్యక్రమంలో పిఎస్యు జిల్లా కార్యదర్శి గోపి పాల్గొన్నారు.

## ప్రాణాలు కాపాడుకోండి

రామసముద్రం జూన్ 26 ప్రభాతవార్త

నేటి సమాజంలోని యువత మత్తు పానీయాలకు దూరంగా ఉండి తమ బావి భవిష్యత్తును కాపాడుకోవాలని ఎంపిడిఓ భానుప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రం లోని పరిధిలోని దిగువ తూర్పు పాఠశాల నుండి అధికారులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల,పాఠశాలల విద్యార్థులచే అంబేద్కర్ సర్కిల్ నందు ర్యాలీ నిర్వహించి సెంటర్లో విద్యార్థులు మానవహారం గా ఏర్పడింది ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్బంగా ఎస్సై రమేష్ బాబు మాట్లాడుతూ సమాజంలోని ఎంతో మంది యువకులు డ్రగ్స్, గంజాయి, మద్యం, గుట్కా, పాన్ లాంటి మత్తు పదార్థాలు సేవిస్తూ తమ ప్రాణాలను బలి చేసుకుంటున్నారని, అలాంటి దురు వ్యసనాల పట్ల దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే భవిష్యత్తులో మేము ఎలాంటి మత్తు పానీయాలకు బానిసలము కాబోమని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. మత్తు పానీయాలకు అలవాటు పడి యువత రోడ్డు ప్రమాదాలకు ఎంతోమంది గురవుతు తమ ప్రాణం పోగొట్టుకుంటున్నారని, దీంతో పాటు ఆరోగ్యాలకు గురై ఆసుపత్రుల పలవుతున్నారని, తమ నూరేళ్ల జీవితం తల్లిదండ్రుల ఆశయాల ను నెరవేర్చక ముందే వారి ఆశలు అడియాసలు అవుతున్నాయన్నారు. మన జీవితాలను మనమే కాపాడుకోవాలని, ఆరోగ్యమే మహాభాగ్యం అని వారన్నారు. ప్రతి ఒక్కరము కలిసికట్టుగా ఉండి డ్రగ్స్ రైతు మండలంగా మార్చుకుందాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ భానుప్రసాద్ తాహిసీల్దార్ మహ్మద్ అజారుద్దీన్, ఎస్సై రమేష్ బాబు,ఎం ఈ ఓ హేమలత,డాక్టర్ ప్రత్యూష, ఏ ఎస్ ఐ హిమాచలపతి ఆంజనేయులు, జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ చిట్టి బాబు, ఆర్ఐ వసీం, సీనియర్ అసిస్టెంట్ రెడ్డెప్ప,హెచ్ ఎం చిట్టి బాబు, తూర్పు పాఠశాల హెచ్ ఎం హేమలత, ఏపీ ఎం సాంబశివ, ఏపీ ఓ మాధవి,అంగన్వాడీ సూపర్ వైజర్ రమాదేవి సీసీ గంగాధర్, లెక్చరర్లు సత్యనారాయణ, రవి మెన్ ఉద్దీన్, చిరంజీవి, శ్రీనివాసులు, దశరథరామిరెడ్డి పాఠశాల ల విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులు, పోలీస్, రెవిన్యూ,మండల కార్యాలయం వైద్య,అంగన్వాడీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీ సాయి విద్యాసంస్థల అధినేతను వరించిన ప్రతిష్టాత్మక సీఎస్ఐ పురస్కారం



రాయచోటి జూన్ 26 ప్రభాత వార్త

శ్రీ సాయి విద్యాసంస్థల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ కే.పీ.వి సుబ్బయ్య 2024,25 సంవత్సరానికి ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేటివ్ రీసెర్చ్ అవార్డు" కి ఎంపికయ్యారు. ఈ మేరకు శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 25 సంవత్సరాలుగా రాయచోటి పట్టణంలో శ్రీ సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పాఠశాల, జూనియర్ కాలేజ్ మరియు ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించి, వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత సేవల కోసం ఈ గుర్తింపు లభించిందని తెలిపారు. ఇక ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు దేశ విదేశాలలో ప్రభుత్వ, ప్రైవేట్, సాఫ్ట్‌వేర్, వ్యాపార రంగాల్లో రాణిస్తూ ఉన్నత స్థానాల్లో ఉన్నారని వెల్లడించారు. సాంకేతిక విద్యా రంగంలో ఆయన చేసిన విశిష్ట కృషిని గుర్తించిన కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా - హైదరాబాద్ చాప్టర్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. వెంకట రమణ, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు కే.పీ.వి సుబ్బయ్యకి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## ఉపాధి హామీ పనులను ఆకస్మిక తనిఖీలు



సిద్దవటం జూన్, 26, ప్రభాతవార్త

ఉపాధి హామీ కూలీలు చేపడుతున్న పనులను ఆకస్మిక తనిఖీలు చేపట్టి కూలీల మస్టర్ పరిశీలించారు. మండలంలోని భాకరాపేట సమీపాన పోలీస్ పటాలయంలో పెద్దపల్లి, భాకరాపేట, శివునిపల్లి, పేరయ్య, గారి పల్లె గ్రామానికి చెందిన 190 మంది ఉపాధి కూలీలు గత వారం నుండి కాలువ పనులు చేస్తున్న, పనులను ఉపాధి హామీ ఏపిఓ, నరసింహులు ఆకస్మిక తనిఖీ చేపట్టి కూలీల నమోదు పరిశీలించారు ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ పోలీస్ పటాలయంలో ఉపాధి హామీ పనులు నిమిత్తం కాలువ పనులు గత వారం నుండి పనులు కొనసాగుతున్నాయని కొండ ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీరు కూలీలు చేపట్టిన కాలువలు ద్వారా చెరువులు, పెన్నా నదిలోకి వెళ్లే విధంగా పనులు చేపడుతున్నామని దీని ప్రభావం వల్ల రైతుల బోర్లకు నీటి శాతం పెరుగుతుందని, కుంటలు, చెరువు ప్రాంతాలలో నీరు నిలవ వల్ల వన్యప్రాణులకు త్రాగునీటి సౌకర్యం ఏర్పడుతుందని పోలీస్ పటాలయంలో కాలువ పనులు రెండు నెలలు కొనసాగుతాయని ఉపాధి హామ కూలీలకు చేసిన పనులకు నగదు చెల్లింపు కొరకై అధికారులకు నివేదిక పంపించామని ఒక వారంలో కూలీలకు చేసిన పనులకు నగదు చెల్లింపు చేపడతామని అన్నారు ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పుల్లయ్య మేటీలు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## త్రిబుల్ ఐటికి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి

రామసముద్రం జూన్ 26 ప్రభాతవార్త

మండలం లోని ఏపీ మోడల్ స్కూల్ కు చెందిన ఎల్. మేఘన త్రిబుల్ ఐ టి కి ఎంపికైనట్లు స్కూల్ ప్రిన్సిపాల్ మునిస్వామినాయక్ తెలిపారు. 2024 , 25విద్యా సంవత్సరంలో పదవతరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ కనబరించింది. దీంతో త్రిబుల్ ఐ టి కి ఎంపిక కావడంతో మేఘనని ప్రిన్సిపాల్ మునిస్వామి నాయక్,నాగరాజు స్కూల్ కమిటీ అధ్యక్షులు బాలాజీ, కమిటీ మెంబర్స్ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## బర్రెల, పాదుగు వ్యాధిపై రైతులు, జాగ్రత్త వహించండి

సిద్ధవటం జూన్26 ప్రభాతవార్త



పాడి రైతులు బర్రెల పొదుగు వ్యాధిపై జాగ్రత్త వహించాలని వెటర్నరీ లైవ్ స్టాక్ అసిస్టెంట్ జిలాని భాష తెలిపారు మండలంలోని జ్యోతి పశు వైద్యశాలలో గురువారం పాడి రైతు పిన్నపురెడ్డి రామ్మూర్తి రెడ్డి బర్రెకు పొదుగు వ్యాధి సోకడంతో మాచుపల్లి వెటర్నరీ వైద్యాధికారి విజయ రాజు, సూచనల మేరకు వెటర్నరీ వైద్య సిబ్బంది చికిత్స అందించారు ఈ సందర్భంగా లైవ్ స్టార్ అసిస్టెంట్ జిలాని భాష గురువారం మాట్లాడుతూ పొదుగు వ్యాధి సోకిన బర్రెలు, పాలు దిగబడి పూర్తిగా తగ్గిపోతుందని దానివల్ల రైతులు పూర్తిగా నష్టపోతారని పొదుగు వ్యాధి నివారణ కొరకై పాడి రైతులు బర్రెల వద్ద శుభ్రంగా పెట్టుకోవాలని, బర్రెలు, గేదెలు మేకలు గొర్రెల ఆరోగ్య సమస్యలపై వైద్యాధికారి సూచనలతో ఎల్లవేళలా వెటర్నరీ సిబ్బంది అందుబాటులో ఉంటామని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## నేల మల్లేశ్వర స్వామి హుండీ ఆదాయం

నిమ్మనపల్లి జూన్ 26 ప్రభాతవార్త



శ్రీ నేల మల్లేశ్వర స్వామి వారి హుండీ ఆదాయం రూ. 23,648/లు శ్రీ నేల మల్లేశ్వర స్వామి వారి హుండీలు లెక్కింపు వలన 23,648 రూపాయలు ఆదాయం వచ్చినది. ఈ మొత్తాన్ని ఇండియన్ బ్యాంక్ వాయల్పాడు నందు దేవస్థానం ఖాతాలో జమ చేయడం అయినది. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మదనపల్లి ఇన్స్పెక్టర్ శశి కుమార్, సర్పంచ్ రెడ్డప్ప, రామకృష్ణ, రాజన్న, అర్చక స్వాములు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నట్లు ఆలయ ఈఓ మంజుల తెలియజేశారు.

# మత్తు పదార్థాలపై పోరాటానికి విద్యార్థులతో ర్యాలీ






**రాయచోటి, జూన్ 26 ప్రభాతవార్త ;**
అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మత్తు పదార్థాలపై అవగాహన కల్పించేందుకు మత్తు వల్ల నాశనం అయ్యే జీవితాలను కాపాడేందుకు గురువారం మండల కేంద్రంలో పోలీసులు వివిధ శాఖల అధికారులు, మోడల్ స్కూల్. జిల్లాపరిషత పాఠశాలల విద్యార్థులు పురవీధుల్లో ప్లెక్సీలు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. బస్టాండు ఆవరణలో మానవహారం నిర్వహించి మాదక ద్రవ్యాల వినియోగ దినోత్సవ ప్రతిజ్ఞ చేసారు.

## హార్సిలీహిల్స్‌లో అంతర్జాతీయ యోగా కేంద్రం

**యోగా గురువు రామ్‌దేవ్ బాబా**



విలేకర్లతో మాట్లాడుతున్న రామ్‌దేవ్ బాబా

**మదనపల్లె, జూన్ 26 ప్రభాతవార్త :**
ప్రముఖ వేసవి విడిది అయిన హార్సిలీహిల్స్‌లో అంతర్జాతీయ అద్యాత్మిక యోగా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని యోగా గురువు రామ్‌దేవ్ బాబా తెలిపారు. గురువారం అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు రామ్‌దేవ బాబా విచ్చేశారు. తొలుత తిరుపతి విమానాశ్రయం నుంచి ఆయన ప్రత్యేక హెలికాప్టర్‌లో మదనపల్లె బిటి కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు విచ్చేశారు. సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్, డిఎస్‌పి మహేంద్ర, తహశీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డిలు హెలిప్యాడ్‌లో రామ్‌దేవ్ బాబాకు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్చం అందజేసి స్వాగతించారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన హార్సిలీహిల్స్‌కు వెళ్లారు. అక్కడ అధికారులతో కలసి అంతర్జాతీయ అద్యాత్మిక యోగా కేంద్రం ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ విలేకర్లతో మాట్లాడుతూ ముందుచూపుతో రాష్ట్రాన్ని అన్ని విధాల ముందుకు నడిపిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అద్యాత్మికంపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఎంతో చరిత్ర కలిగిన హార్సిలీహిల్స్ కొండపై రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో తాము అంతర్జాతీయ అధ్యాత్మిక కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం హార్సిలీహిల్స్ నుంచి నేరుగా మదనపల్లెలోని బిటి కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు వచ్చి హెలిక్యాప్టర్‌లో బెంగుళూరుకు వెళ్లారు. రామ్‌దేవ బాబా పర్యటనలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా డిఎస్‌పి మహేంద్ర ఆధ్వర్యంలో పటిష్ట పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా రోడ్డు పొడవునా పోలీసులను బందోబస్తు ఏర్పాటు చేశారు. హెలిప్యాడ్ వద్ద పలువురు బిజెపి నాయకులు ఆయనకు వీడ్కోలు పలికారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి




**వేంపల్లి: జూన్ 26 (ప్రభాత వార్త):**
విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటం వలన భవిష్యత్తు సుఖము కాగలదని ఎస్సై ఏ. తిరుపాల్ నాయక్ పిలుపునిచ్చారు. స్థానిక వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో మాదకద్రవ్యాల వినియోగం అరికట్టడానికి అవగాహన కల్పించడంతో పాటు, ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎస్. నాగేంద్ర మాదకద్రవ్యాలతో కలిగే దుష్ఫలితాల గురించి యువతి యువకులకు అవగాహన కల్పించడం మన బాధ్యతని తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం. ఓబుల్ రెడ్డి మత్తుపదార్థాల రహిత సమాజానికి మనమందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ కే. సతీష్ ఐక్యూఎస్ కోఆర్డినేటర్ మాట్లాడుతూ సమాజంలో జరిగే కొన్ని ఉదాహరణల ద్వారా మత్తుపదార్థాల నిర్మూలనకు నడుము కట్టాలని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం పట్టణ పురవీధుల గుండా ర్యాలీ ప్రదర్శన చేయడం జరిగినది.

## అక్రమ నిర్మాణాలు తొలగించేందుకు సిద్ధమైన రెవెన్యూ సిబ్బంది

**బద్వేలు ,జూన్ 26 , ప్రభాతవార్త**
బద్వేల్ మండలం బయినపల్లి గ్రామం వద్ద ఉన్న చెరువు పోరంబోకు స్థలం సర్వే నెంబర్ 26 /బి లో వైఎస్ఆర్సిపి పార్టీకి చెందిన శ్రీకాంత్ రెడ్డి అక్రమ నిర్మాణాలు చేపట్టారని గురువారం రెవెన్యూ, పోలీస్ ఇరిగేషన్ సిబ్బంది అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను తొలగించే నేపథ్యంలో ఉద్రిక్త చోటు చేసుకుంది. ఇక్కడ అక్రమ నిర్మాణాలు అధికమవుతుండడంతో ఇరిగేషన్ రెవెన్యూ సిబ్బంది కొరడా గెలిపించాలని నిర్ణయించిన నేపథ్యంలో బయనపల్లెలో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. ఇందులో భాగంగా అక్రమ నిర్మాణాలు తొలగించేందుకు సిద్ధమైన పోలీసులు, ఇరిగేషన్ అదికారులతో స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాటాడుతూ ప్రతిపక్ష నేతలమైన మా మీద కక్షపూరితంగా వ్యవహరించడం తగదన్నారు. అలాగే అధికార పార్టీ నాయకులు వంక, వాగులలో అక్రమ నిర్మాణాలు చేపట్టారని, ఆ అక్రమ నిర్మాణాలు మీకు కనపడలేదా అని ప్రశ్నించారు. ఇందుకు ఇరిగేషన్ అధికారి వేణుగోపాల్ రెడ్డి సమాధానం ఇస్తూ ఈ ఆక్రమణ తొలగింపు గతంలో ఉండేదని అలాగే ఇప్పుడు కొనసాగిస్తున్నామని దీనిపై తమకు అధికార, ప్రతిపక్షాలు తో ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. చట్టం అందరికీ ఒకటేనన్నారు. ఎప్పటికైనా అక్రమణాలపై ఉపేక్షించేది లేదని ఇది ప్రభుత్వం నుంచి వచ్చిన ఆజ్ఞ అని దానిని తాముతప్పక పాటించాల్సిందే అన్నారు. ఇది ఇలాగే కొనసాగితే ప్రభుత్వ, ప్రజాప్రతినిధులు ప్రజల విశ్వసనీయత కోల్పోవాల్సి వస్తుందని శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు.



## మత్తులోపడి యువత ఆరోగ్యాన్ని చిత్తు చేసుకోవద్దు




ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు

**పీలేరు జూన్ 26 ప్రభాతవార్త :**
మత్తు పదార్థాల వినియోగానికి అలవాటు పడటం వల్ల మన ఆరోగ్యంతో పాటు బతుకులు కూడా బుగ్గి అవుతాయని పీలేరు తహశీల్దారు శివకుమార్ తెలిపారు. అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమరవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని గురువారం పీలేరు పట్టణంలో రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మాదకద్రవ్య వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్య సమస్యలు, ఆర్థిక నష్టాలు, కుటుంబ ఎదుర్కొనే కష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలు, డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉంటూ తమ భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. అంతేకాకుండా ఎలాంటి మత్తు పదార్థాలకు లోనుకాకుండా ఉండాలని తెలియజేశారు. డ్రగ్స్ రహిత సమాజం సంక్షేమానికి సంకేతమని, ఎవరూ డ్రగ్స్ కు బానిసై కన్నవాళ్లకు కడుపుకోతను మిగిల్చవద్దని, డ్రగ్స్ ను కలిగి ఉండటం, అమ్మడం నేరమని అన్నారు. డ్రగ్స్ భూతాన్ని తరిమి, డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ సాకారానికి అందరం కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివశంకర్, డిప్యూటీ ఎంపీడీవో లతీఫ్ ఖాన్, సీఐ యుగంధర్, ఎస్సై లోకేష్, ఐసిడిఎస్ పీలేరు ప్రాజెక్టు సిడిపిఓ రాజమ్మ, ఎంఈఓ 2 పద్మావతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామమూర్తి, టిడిపి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వారణాసి శ్రీకాంత్ రెడ్డి, పసుపులేటి లక్ష్మీకర, బీసీ నాయకులు పోలిశెట్టి సురేంద్ర, ఏ. అమర్నాథరెడ్డి, నల్లారి రియాజ్, ఏసీ సెల్ నాయకులు సుభాష్, బుజ్జు తదితర నాయకులు కార్యకర్తలు, అంగన్వాడి, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, ఎన్.సి.సి, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలు భవిష్యత్తును నాశనం చేస్తాయి

**సుండుపల్లె, జూన్ 26, ప్రభాతవార్త:**
మాదకద్రవ్యాలు లేని సమాజం కోసం కలిసికట్టుగా కృషి చేద్దామని ఎంపీడీవో సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నుండి బస్టాండ్ ఆవరణ వరకు మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్వాడి కార్యకర్తలు మరియు పోలీసులు మండల అధికారులు కలిసి భారీగా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వ్యక్తుల ఆరోగ్యాన్నే కాకుండా కుటుంబాలను, సమాజ భద్రతలను దెబ్బతీస్తాయని తెలిపారు. యువత భవిష్యత్తును నాశనం చేసే ఈ మాదకద్రవ్యాలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని సూచించారు. పిల్లలపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని, వారి ప్రవర్తనలో ఏమైనా మార్పులు వస్తే వెంటనే గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్ వ్యసనాన్ని రూపుమాపడానికి ప్రభుత్వంతోపాటు ప్రజలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్యాసంస్థలు కలిసి పనిచేయాలని వారు తెలిపారు. డ్రగ్స్ గురించి సమాజంలో అవగాహన పెంచడం ద్వారా దీనిని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీస్ శాఖ వారు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు వ్యతిరేకంగా కదం తొక్కిన విద్యార్థులు



**రాజంపేట,జూన్ 26 ప్రభాతవార్త**
అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులు కదం తొక్కారు. గురువారం అన్నమాచార్య యూనివర్సిటీలో డ్రగ్స్ జోలికి వెళ్లి బానిసలం కాబోమని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అలాగే ఎక్సైజ్ మల్లికా ఆధ్వర్యంలో జనసేన నేత శ్రీనివాసరాజు వ్యతిరేకంగా ర్యాలీని ప్రారంభించారు. అలాగే రాజంపేట పట్టణంలో అర్బన్ సీఐ రాజా, విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు డ్రగ్స్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ జోలికి వెళ్ళమని మానవహారంగా ఏర్పడి విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ర్యాలీ ఎం.ఆర్.ఓ ఆఫీసు నుండి మీదుగా పాత బస్టాండ్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా రాజంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజ మాట్లాడుతూ సమాజానికి మహమ్మారిలా మారిన మాదక ద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా పాఠశాలల నుండే అవగాహన కార్యక్రమాలు ప్రారంభించాలని వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలు చెబుతున్నాయని అన్నారు. మత్తు పదార్థాల భారిన పడినట్లయితే మళ్లీ వెనక్కు రాలేరని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకునే చర్యలతోనే మత్తు పదార్థాల నియంత్రణకు వీలు కలుగుతుందన్నారు. అన్నమాచార్య యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థుల చేత అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ స్వర్ణలత , ఎక్సైస్ ఏ మల్లికా, రాజంపేట తాసిల్దార్ పీర్ మున్నీ, బిజెపి రాష్ట్ర కార్యదర్శి రమేష్ నాయుడు ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ జోలికి వెళ్లి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు.

## గోడపత్రాలు ఆవిష్కరించిన టిటిడి చైర్మన్

**రాజంపేట, జూన్26 ప్రభాతవార్త**



జూలై 5, 6 తేదీలలో జగనన్న నందలూరు సౌమ్యనాథ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ,రాజంపేట మండలం తాళ్లపాకలో వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన గోడపత్రాలను తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బిఆర్ నాయుడు గురువారం తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. టిటిడి ఉప కార్య నిర్వహణ అధికారి వెంకయ్య చౌదరితో కలిసి బిఆర్ నాయుడు గోడ పత్రాలను ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిటిడి అధికారులు నటేష్ బాబు, ప్రశాంతి పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహితం కోసం ప్రతి ఒక్కరూ కలిసి రావాలి

**ఎమ్మెల్యే షాజహాన్‌బాషా**




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**మదనపల్లె, జూన్ 26 ప్రభాతవార్త :**
డ్రగ్స్ రహితం కోసం ప్రతి ఒక్కరూ కలసి రావాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు గురువారం పట్టణంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, డిఎస్‌పి మహేంద్రలతో కలసి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ర్యాలీలో పాల్గొన్నారు. మిషన్‌కాంపౌండ్ నుంచి బెంగుళూరు బస్టాండు, మల్లికార్జున సర్కిల్ వరకు మహిళలు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత ర్యాలీని ఎమ్మెల్యే జెండాఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో డ్రగ్స్ రహిత రాష్ట్ర ఏర్పాటుకు ప్రతి విద్యార్థి సహకారం అందించాలన్నారు. మదనపల్లె పేరు ప్రఖ్యాతలు పెంపొందించే విధంగా విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను ఆదిరోహించాలన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశయసాధన కోసం కృషి చేయాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామంటూ విద్యార్థులచే ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి, ఎంపిడిఓ తాజ్‌మస్రూన్, పోర్డు డైరెక్టర్ లలితమ్మ, మెప్మా ఆర్‌పిలు, డిఒఈఓ, టిడిపి నాయకులు యుగంధర్, శీతక్క, జేసిబి వేణు, మధు, జీవి.నాయుడు, మైనార్టీ నాయకులు ఎస్ఎం.రఫి, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## పనుల జాప్యంపై ఉప ముఖ్యమంత్రికి ఫిర్యాదు

**రాజంపేట,జూన్27 ప్రభాతవార్త**



కడప రేణిగుంట జాతీయ రహదారి నిర్మాణం పనులు ప్రారంభించడంలో తీవ్ర ఆలస్యం అయిందని ,పర్యావరణ అనుమతుల ఆలస్యం కావడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ,రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి దృష్టికి తీసుకు వెళ్లారు. వారం రాజమండ్రిలో అఖండ గోదావరి పనుల ప్రారంభోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ రహదారిలో నిత్యము దాదాపు 15 వేల పైగా వాహనాలు ప్రయాణిస్తున్నాయని, ఈ మధ్యకాలంలో ఈ రహదారిలో ఎక్కువ ప్రమాదాలు జరిగి చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు దీనిని దృష్టిలో ఉంచుకొని త్వరగా అటవీ పర్యావరణ అనుమతులు మంజూరు చేయుటకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పవన్ కళ్యాణ్ స్పందించి పర్యావరణ అనుమతులకు సంబంధించి చర్యలు వెంటనే చేపడతామని చెప్పినట్లు సాయి లోకేష్ తెలిపారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



**సంబేపల్లి జూన్ 26 ప్రభాత వార్త:**
అంతర్జాతీయ మత్తు పదాలు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించేందుకు కాపాడేందుకు సంబేపల్లి మండల కేంద్రంలో గురువారం ఎంపీడీవో కార్యాలయం నుండి వడ్లపల్లి రోడ్డు చివరి వరకు జాతీయ రహదారిపై అధికారులు నాయకులు విద్యార్థులు అంగన్వాడీ కార్యకర్తలు వెలుగు మహిళలు ఆశ వర్కర్లతో కలిసి మత్తు వద్దు ఆరోగ్యం ముద్దు, యువత మత్తు సమాజానికి విపత్తు డ్రగ్స్ సరదా కాదు మరణ శాసనం అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు ఎన్టీఆర్ సర్కిల్ ఎదురుగా మనోహరంగా ఏర్పడి మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రయోజనాల గురించి ఎంపీడీవో రామచంద్ర ఎస్సై భక్తవత్సలం వివరించారు సందర్భంగా ఎస్ఐ భక్తవత్సలం మాట్లాడుతూ ప్రజలు యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మత్తు పదార్థాలు వినియోగించడం వల్ల అనారోగ్యం బారినపడి క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అంతేకాకుండా వారి యొక్క కుటుంబాలు చిన్నభిన్నమవుతాయని అన్నారు ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న మీరు దూరాలవాట్లకు మత్తు పదార్థాలకు బానిసై మీ జీవితాలను పోగొట్టుకుంటున్నారని అన్నారు ఎవరు కూడా మత్తు పదార్థాలు వినియోగాన్ని ప్రోత్సహించకూడదని వాటిని నివారించేందుకు యువత ముందుండి ప్రతి ఒక్కరి కి అవగాహన కల్పించాలని మత్తు పదార్థాలను నివారించాలని అన్నారు అనంతరం మత్తు పదార్థాలు వాడటం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు విద్యార్థులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు నాగేశ్వర్ నాయుడు ఎంఈఓ శ్రీనివాసులు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్ ఉపాధ్యాయుడు ఓబుల్ రెడ్డి అంగన్వాడి సూపర్వైజర్లు పలువురు ఉద్యోగులు విద్యార్థులు పాల్గొన్నారు.

## గొర్రెలకు, మేకలకు, ఉచితంగా మందులు

**సుండుపల్లె, జూన్ 26 ప్రభాతవార్త :**
ఉచితంగా నట్టాల నివారణ మందులను గొర్రెలు మేకలకు అందజేస్తున్నట్లు డి ఎ హెచ్ ఓ డాక్టర్ గుణశేఖర్ పిళ్లై తెలిపారు. గురువారం సుండుపల్లి మండల కేంద్రానికి సమీపంలోని ఈడిగ పల్లెలో గొర్రెలకు నటల నివారణ మందులను వేసినట్లు ఆయన తెలిపారు. సుండుపల్లె, వీరబల్లి మండలాల్లో గురువారం ఈ మందులు వేశామని ఈనెల 26వ తేదీ నుండి జూలై 10వ తేదీ వరకు మందులను వేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మేకలు గొర్రెల కాపరల్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో మూగజీవాలకు పలు రకాల వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ఏవైనా రోగాలు సంభవించినప్పుడు సమీపంలోని పశు వైద్యాధికారులను కలిసి తగిన వైద్యం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ విజయకుమార్, డి ఎం హెచ్ ఓ డాక్టర్ మాలకొండయ్య, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, సంబేపల్లి పశువైద్యాధికారి లోకేష్, ఏ డి వెంకటేశ్వర రెడ్డి, గోపాలమిత్ర సిబ్బంది పాల్గొన్నారు.



# క్షయ వ్యాధిపై అవగాహన



**సుండుపల్లి, జూన్ 26,ప్రభాతవార్త:**
మండల పరిధిలోని రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ముదుంపాడు గ్రామ పంచాయతి లోని కురవపల్లి నందు క్షయ వ్యాధి పై డాక్టర్ రుబీనా గఅవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరు మాట్లాడే టప్పుడు మరియు దగ్గెటప్పుడు చేతులు అడ్డం పెట్టుకోవాలని, క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవాళ్ల గళ్ళ పరీక్ష చేయించుకోలని, 6నెల పాటు మందులు వాడితే జబ్బు పూర్తి నయం అవుతుందని చెప్పారు. ఈ ప్రోగ్రాం నందు ముదుంపాడు సర్పంచ్ రామస్వామి రెడ్డి పాల్గొన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ క్షయ వ్యాధితో బాధపడే వారు పరీక్ష చేసుకొని చికిత్స తీసుకోవాలని చెప్పారు. ఈ ప్రోగ్రాం నందు ఎంపీహెఇఒ వీర నారాయణ, సిహెచ్ఓ ఎంపిహెచ్ఎ జయపాల్, ప్రేమలత సిహెచ్ఓ సాల్మోహన్, ఎఎన్ఎం సౌజన్య ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది




**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 26 ప్రభాతవార్త:**
పట్టణంలోని వైఎంఆర్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టిబి రోడ్డు. 2, పరిధిలోని 3,సచివాలయంలలో టిబి ముక్తి భారత్ ప్రోగ్రాంలో జరుగుతున్న సర్వేను వైద్యాధికారి డాక్టర్ హిమబిందు ఇంటింటికి వెళ్లి సర్వేను పరిశీలించి మన ఆరోగ్యం మన చేతుల్లో ఉందన్నారు. వైద్యాధికారి మాట్లాడుతూ రెండు వారాల నుంచి దగ్గు వస్తున్న వారు, బరువు తగ్గిపోతున్నవారు, ఆకలి లేనటువంటి వారు, దగ్గినప్పుడు గళ్ళలో రక్తం పడటం సాయంత్రం జ్వరం వస్తున్న వారు, ఈ లక్షణాలు ఉన్నవారు గళ్ళ పరీక్ష చేయించు కోవడం వలన టీబీ ఉందా లేదా అని తెలుసుకోవచ్చునని, ఆరు నెలలు మందులు ప్రభుత్వం వారు ఉచితంగా ఇస్తారని దీనిని ప్రజలందరు వినియోగించుకొనవలెనని తెలియజేశారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శోభ రాణి మాట్లాడుతూ షుగర్ ధూమపానము, మద్యపానం, పోషక ఆహారం లోపం ఉన్నవారు, హెచ్ఐవి ఉన్నవారు, కిడ్నీ, క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు, టిబి మందులు వాడి నయమైన వారి కుటుంబ సభ్యులు, గళ్ళ పరీక్ష చేయించుకోవడం వలన ఈ వ్యాధి ఉందో లేదో అని తెలుసుకోవచ్చని టీబీని నిర్మూలించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిబి సూపర్వైజర్ రాజారత్నం, టీవీ హెల్త్ విజిటర్ సిద్ధారెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎంవి సుబ్బారెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు మల్లేశ్వరి, జ్యోతి, ఆశా కార్యకర్తలు మల్లేశ్వరి, పుష్పకుమారి,ప్రణీత, తులసి పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత




**బ్రహ్మంగారిమఠం జూన్ 26 ప్రభాతవార్త:**
విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుందని మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు గురువారం మండలంలోని తోట్లపల్లె గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహా గురుకులం పాఠశాలను ఆయన సందర్శించారు. అక్కడ జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్ర లో విద్య అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. రాజకీయాల కతీతంగా సర్వేపల్లి రాధాకృష్ణ పేరుతో విద్యార్థులకు అవసరమైన విద్యా కానుకలను అందిస్తున్నారు. అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నారు. అనంతరం బ్రహ్మంగారిమఠం మండల కేంద్రమైన నాలుగు రోడ్ల సెంటర్లో రోడ్డు విస్తరణ తాత్కాలిక మ్యాపు ను అధికారులతో చర్చించారు.బస్సు షెల్టర్, డ్రైనేజీ మఠంలో మరికొన్ని జరగవలసిన అభివృద్ధి పనుల గురించి చర్చించారు. మండల తెలుగుదేశం అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, ఎస్సార్ శ్రీనివాసులు రెడ్డి,పి ఆర్ డి డి ఈ మధు, ఎస్సై శివప్రసాద్, మండల తెలుగుదేశం నాయకులు వెల్లటూరు సాంబశివారెడ్డి, చిలమల నారాయణయాదవ్, మేకల సుధాకర్ యాదవ్,పూజా శివయ్య యాదవ్,బోలా శ్రీను,నరసింహ గౌడ్, ఆవుల దస్తగిరి, ముదుమాల టిడిపి నాయకుడు రమణయ్య తదితరులు ఉన్నారు.

## మత్తు పదార్థాల వదులుకో జీవితాన్ని నిలబెట్టుకో

**పులివెందుల,జూన్26, ప్రభాత వార్త:**
విద్యార్థులు ,ప్రజలు మత్తు పదార్థాల జోలికి వెళ్ళద్దు అని వాటి జోలికి వెళితే నిండు జీవితాన్ని నాశనం చేసుకున్నట్టే కావున వాటికి దూరంగా ఉండాలని పులివెందుల ఆర్టీవో చిన్నయ్య, డీఎస్పీ మురళి నాయక్ అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దినోత్సవం సందర్భంగా బాల్యాన్ని బలి తీసుకుంటున్న డ్రగ్స్, మత్తులో పిల్లలపై ఆగాయిత్యాల అనే కార్యక్రమం నిర్వహించి వాటిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జేఎన్టీయూ,లయోలా డిగ్రీ కళాశాల విద్యార్థులు మహిళలతో పోలీసులు డీఎస్పీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయిని పెంచకు, పంచకు, పీల్చకు, గంజాయి అలవాటు జీవితానికి పొరపాటు అంటూ నినాదాలు చేశారు. అనంతరం పూలంగళ్ళ కూడలి వద్ద పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ మరియు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం మత్తు పదార్థాలు సేవించిన మత్తులో మహిళలపై అఘాయిత్యాలతో పాటు, ప్రమాదాలు జరుగుతున్నాయని దీనివల్ల ఎంతోమంది జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై బాధ్యతగా ఉండి తప్పు దారి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ లు చాంద్ భాషా, నరసింహులు, వెంకటరమణ, ఉలసయ్య, ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి, ఎస్సైలు నారాయణ, రవికుమార్, తాసిల్దార్ నజీర్ అహ్మద్, జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపల్ విష్ణువర్ధన్, మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర రావు, పోలీసులు, జేఎన్టీయూ కాలేజీ, మహిళ డిగ్రీ కాలేజీ, పాలిటెక్నికల్ కాలేజ్, వేముల కస్తూరిబా, ప్రిన్సిపల్ లు, విద్యార్థులు, రెవెన్యూ, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

